
ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 31.0
కనిష్ఠం 24.0
ANDHRAJYOTHY
నల్లగొండ
5
ఆదివారం 11 ఆగస్టు 2024



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	588.10 (306.1010)	4,14,128	3,55,549
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	641.60 (3.59)	590.62	393.97
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	168.20 (35.86)	3,29,189	3,16,504

చికెన్ ధరలు | లైవ్ : రూ.108 | డ్రెస్ : రూ.180 | స్కిన్‌లెస్ : రూ.200

ప్రాజెక్టులు పూర్తయితేనే

ఆయకట్టుకు సాగునీరు



నిలిచిన కాల్వ పనులు

ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్-1

జిల్లాలో ప్రధాన సాగునీటి ప్రాజెక్టులైన శ్రీశైలం సొరంగమార్గం, నక్కలగండి, పెండ్లిపాకలతోపాటు గుట్టలపై ఉన్న గ్రామాలకు నీరందించే ఎత్తిపోతల పథకాల పనులు నిలిచిపోయాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం, ఎస్ఎల్‌బీసీ, డిండి, ప్రాజెక్టులకు నిధులు కేటాయించడంతో వీటి పనులు వేగవంతమవుతాయనే ఆశలో ఆయకట్టు రైతులు ఉన్నారు.

\- దేవరకొండ

» ఎస్ఎల్‌బీసీ, డిండి, నక్కలగండి ప్రాజెక్టులపై దృష్టిసారించిన ప్రభుత్వం » నేడు సాగునీటి ప్రాజెక్టులపై మంత్రి సమీక్ష

ప్రస్తుతం ఏఎమ్మార్పీ కాల్వలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ప్రధాన కాల్వతోపాటు డిస్ట్రిబ్యూటరీలు, ఇరువైపులా కంపచెట్లు పెరిగి ఆనవాళ్లు కోల్పోయే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం ఏఎమ్మార్పీకి నిధులు కేటాయించి కాల్వలకు మరమ్మతులు చేపట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. జిల్లాలోని మూడున్నర లక్షల ఎకరాలకు సాగునీరు, ఐదువందల గ్రామాలకు తాగునీరు అందించేందుకు ఉద్దేశించిన శ్రీశైలం సొరంగం పనులను 2005లో అప్పటి సీఎం వైఎస్.రాజశేఖర్‌రెడ్డి రూ.1,925కోట్ల వ్యయంతో ప్రారంభించారు. 43.93కిలోమీటర్లు సొరంగం తవ్వాల్సి ఉండగా, ఇప్పటివరకు 34.37కిలోమీటర్లు పూర్తయింది. ఇంకా 9.559కిలోమీటర్లమేర సొరంగం తవ్వాల్సి ఉంది. ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.4,618కోట్లకు పెరిగింది. ఇప్పటివరకు రూ.25 వేల కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయి. సొరంగాన్ని తొలిచే టన్నెల్ బోరింగ్ మిషన్(టీబీఎం) తరచూ మరమ్మతులకు గురికావడం, గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ పనులకు నిధులు కేటాయించకపోవడంతో పనుల్లో జాప్యం ఏర్పడింది. ప్రస్తుతం టీబీఎం మరమ్మతులకు గురికావడంతో పనులు నిలిచాయి. జర్మని నుంచి పనిముట్లు తెప్పించి మరమ్మతులు చేసి పనులను ప్రారంభిస్తామని అధికారులు చెబుతున్నారు.

నిలిచిన ఎస్ఎల్‌బీసీ ఓపెన్‌కెనాల్ పనులు

పెండ్లిపాకల ప్రాజెక్టు ఎత్తుపెంపు, ఎస్ఎల్‌బీసీ ఓపెన్‌కెనాల్ పనులు ప్రసుత్తం నిలిచాయి. ఇప్పటి వరకు మొత్తం 30శాతం పనులే పూర్తయ్యాయి. 2009లో రూ.459కోట్లతో ఈ ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన చేశారు. పెండ్లిపాకల ప్రాజెక్టు ఎత్తుపెంపు, ఎస్ఎల్‌బీసీ ఓపెన్‌కెనాల్ పనులు చేయాల్సి ఉండగా, కాంట్రాక్టర్ ముందుకు రాకపోగా అరకొరగా పనులు చేపట్టి పనులు నిలిపివేశాడు. ప్రాజెక్టు పరిధిలో కారోబార్‌తండా, పత్యతండా, హరియాతండా, గుడితండా ముంపునకు గురికానున్నాయి. భూనిర్వాసితులకు పూర్తిస్థాయిలో పరిహారం, పునరావాసం కల్పించాల్సి ఉంది. అధికారులు గ్రామసభలు నిర్వహించి పరిహారం అందజేయగా, మరికొంత మందికి చెల్లించాల్సి ఉంది.

ముందుకుసాగని నక్కలగండి పనులు

జిల్లాలో 40వేల ఎకరాలకు సాగునీరందించే నక్కలగండి రిజర్వాయర్ పనులు 90శాతంపైగా పూర్తయ్యాయి. రూ.543కోట్లతో 7.64టీఎంసీల సామర్థ్యంతో నిర్మించనున్న ఈ ప్రాజెక్టుకు 2009లో శంకుస్థాపన చేశారు. ప్రాజెక్టులో భూములు, ఇళ్లు కోల్పోతున్న నక్కలగండితండా, నాగర్‌కర్నూల్ జిల్లా మార్లపాడు తండా,కేశ్యతండా నిర్వాసితులకు పునరావాసం కల్పించాల్సి ఉంది.

డిండి నిర్వాసితులకు అందని పరిహారం

డిండి ఎత్తిపోతల పథకాన్ని 2015లో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ శంకుస్థాపన చేశారు. రూ.6,190కోట్లతో ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన చేసి రెండున్నర ఏళ్లలో పూర్తిచేసి జిల్లా ప్రజలకు సాగునీరు అందిస్తామని నాడు కేసీఆర్ ప్రకటించారు. కానీ, ఏళ్లు గడుస్తున్నా ప్రాజెక్టు పరిధిలోని రిజర్వాయర్ల కింద భూములు కోల్పోతున్న నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పరిహారం, పునరావాసం కల్పించకపోవడంతో బాధిత రైతులు ఆందోళనలు చేస్తున్నారు. ఇప్పటికే గొట్టిముక్కల రిజర్వాయర్ పనులు 95 శాతం, సింగరాజుపల్లి 90శాతం,శివన్నగూడెం 50శాతం పనులు పూర్తయ్యాయి. చింతపల్లి, ఉల్పర, గోకారం, ఇర్విన్, కిష్టరాయన్‌పల్లి రిజర్వాయర్ పనులు సాగుతున్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక నిధులు కేటాయించడంతో ప్రాజెక్టు పను లు వేగవంతమయ్యాయి. కిష్టరాయనపల్లి రిజర్వాయర్ పరిధిలోని ఈదులగండి, చర్లగూడెం రిజర్వాయర్ పరిధిలోని వెంకెప ల్లి,వెంకెపల్లితండా, చర్లగూడెం, నర్సింహులగూడెంతోపాటు కిష్టరాయన్‌పల్లి భూనిర్వాసితులకు పునరావాసం కల్పించాల్సి ఉంది.

ఎత్తిపోతల పనులు పూర్తయ్యేదెన్నడో?

దేవరకొండ నియోజకవర్గంలోని గుట్టలపై ఉన్న గ్రామాలకు ఎత్తిపోతల పథకాల ద్వారా సాగునీరు అందించాలని 2021 ఫిబ్రవరిలో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ పనులకు శంకుస్థాపన చేశారు. నాగార్జునసాగర్‌లో ముంపునకు గురైన బాధితులు చందంపేట, నేరేడుగొమ్ము, పీఏపల్లి మండలాల్లోని గుట్టలపై పునరావాసం ఏర్పాటు చేసుకొని వర్షాధారం ఆధారంగా పంటలు సాగుచేస్తూ జీవనం సాగిస్తున్నారు. రూ.585కోట్లతో పొగిళ్ల ఎత్తిపోతల, కంభాలపల్లి, అంబాభవాని, ఏకేబీఆర్, పెద్దగట్టు ఎత్తిపోతల పథకాల పనులకు శంకుస్థాపన చేశారు. అయితే నిధుల కొరత, అటవీశాఖ అనుమతులులేకపోవడంతో ఈ పనులు ముందుకుసాగడంలేదు. నిధులు కేటాయించి అటవీశాఖ అనుమతులు సాధించి పనులను పూర్తిచేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

నేడు మంత్రుల సమీక్ష...

సాగునీటి ప్రాజెక్టులపై నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సమీక్షించనున్నారు. తొలుత అడవిదేవులపల్లి మండల కేంద్రం శివారులోని దున్నపోతులగండి ఎత్తిపోతల పథకాన్ని ఆదివారం మధ్యాహ్నం 2గంటల సమయంలో ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డితో కలిసి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పరిశీలించనున్నారు. అనంతరం పథకం పనుల పురోగతిపై అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించనున్నారు. దేవరకొండ నియోజకవర్గంలో సాగునీటి ప్రాజెక్టులపై మంత్రులు ఉత్తమ్, వెంకట్‌రెడ్డి డిండి మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఆదివారం సాయంత్రం 4గంటలకు సమీక్ష నిర్వహించనున్నారు.

నత్తనడకన దున్నపోతులగండి ఎత్తిపోతల పనులు

దామరచర్ల: బీడు భూములను సాగు భూములుగా మార్చేందుకు గత ప్రభుత్వం అడవిదేవులపల్లి మండలంలోని దున్నపోతులగండి ఎత్తిపోతల పథకం పనులను ప్రారంభించగా, పనులు రెండేళ్లుగా నత్తనకడన సాగుతున్నాయి. మండలంలోని చిట్యాల వద్ద ఎగువ ప్రాంతం నుంచి వచ్చిన హాలియా వాగు కలుస్తోంది. ఈ ప్రాంతంలో నీటి వృథాను అరికట్టేందుకు దున్నపోతులగండి వద్ద రూ.219కోట్ల వ్యయంతో ఎత్తిపోతల పథకానికి గత ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 16కి.మీ మేర పైపులైన్ ద్వారా అడవిదేవులపల్లి మండలంలోని బాల్నెపల్లి, ఉల్సాయిపాలెం, అడవిదేవులపల్లి, చాంప్లాతండా, ముదిమాణిక్యం, చిట్యాల, మొల్కచర్ల తదితర గ్రామాల పరిధిలో 12,610 ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో పనులు ప్రారంభించారు. ప్రారంభం నుంచే పూర్తిస్థాయిలో పనులు సాగలేదు. ఇప్పటి వరకు 10శాతం పనులే పూర్తయ్యాయి.



పిచ్చి మొక్కలతో నిండిన కాల్వ

అధ్వానంగా ఏఎమ్మార్పీ కాల్వలు

జిల్లాలోని 2.20లక్షల ఎకరాలకు సాగునీరు, హైదరాబాద్ జంట నగరాలతోపాటు జిల్లాలోని 516 గ్రామాలకు తాగునీరు అందించే ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు (ఏఎమ్మార్పీ) కాల్వలు అధ్వానంగా తయారయ్యాయి. కొన్నేళ్లుగా మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రధాన కాల్వతోపాటు డిస్ట్రిబ్యూటరీలకు ఇరువైపులా కంపచెట్లు ఏపుగా పెరిగి శిథిలావస్థకు చేరుకున్నాయి. ప్రస్తుతం నాగార్జునసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండడంతో నీటిని విడుదల చేస్తున్నారు. ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వ ద్వారా ఉదయ సముద్రంతోపాటు జిల్లాలోని 90 చెరువులు నింపడానికి 1,200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. హైదరాబాద్ జంటనగరాలకు 525 క్యూసెక్కులు, జిల్లాలోని మిషన్‌భగీరథకు 50 క్యూసెక్కుల నీటిని తాగు నీటి అవసరాలకు విడుదల చేస్తున్నారు. ప్రధాన కాల్వతోపాటు, డిస్ట్రిబ్యూటరీలు, కంపచెట్లు ఏపుగా పెరిగి శిథిలావస్థకు చేరడంతో సాగునీరు వృథా అవుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రూ.50కోట్లు కేటాయించి ప్రధాన కాల్వ, డిస్ట్రిబ్యూటరీలకు మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు.

భూగర్భ జలం



పడిపోతోంది

- 6.16మీటర్ల దిగువకు నీటిమట్టం
- జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు
- సాధారణం కంటే తక్కువగా నమోదు
- గత ఏడాది జూలైలో 4.74మీటర్ల లోతులో
- ఈ ఏడాది 10.90మీటర్ల లోతుకు
- నిండని చెరువులు, ముందుకు కదలని సాగు



అడుగంటిన భూగర్భజలాలు

జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. భారీ వర్షాలు లేకపోవడంతో చెరువులు, కుంటల్లోకి నీరు చేరలేదు. దీంతో జిల్లా వ్యాప్తంగా భూగర్భజలాలు గణనీయంగా అడుగంటుతున్నాయి. గత ఏడాదితో పోలిస్తే ఈసారి దిగువకు నీటిమట్టం పడిపోయింది. గత ఏడాది జూలైలో 4.74 మీటర్ల లోతులో భూగర్భ నీటిమట్టం ఉండగా, ఈసారి 10.90మీటర్ల లోతుకు చేరింది. గత ఏడాదితో పోలిస్తే ఈ సారి 6.16మీటర్ల దిగువకు నీటిమట్టం పడిపోయింది. జిల్లాలో అత్యధికంగా నారాయణపూర్ మండలంలో భూగర్భ జలం 18.58మీటర్ల లోతులో ఉండగా, అడ్డగూడూరు మండలంలో 4.57మీటర్ల లోతులో నీటిమట్టం ఉంది.

\- (ఆంధ్రజ్యోతి,యాదాద్రి)

వర్షాకాలం సీజన్ అదను దాటుతుండటంతో పంటలు సాగుకు సమయం మించుతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో అధిక శాతం మంది రైతులు వ్యవసాయ బోరుబావులపైనే ఆధారపడి పంటలు సాగుచేస్తున్నారు. ఓ వైపు తీవ్ర వర్షాభావం, మరోవైపు భూగర్భజలాలు అడుగంటడంతో వ్యవసాయ బోరుబావుల్లో నీటిమట్టం పడిపోతోంది. వానాకాలం సీజన్‌లో ఇప్పటివరకు సాధారణ వర్షపాతం 292.4మిల్లీమీటర్లకు 265.1మిల్లీమీటర్ల వర్షం కురిసింది. సాధారణం కంటే 9శాతం తక్కువగా వర్షపాతం నమోదైంది. జిల్లాలో 17మండలాలకు 15 మండలాల్లో సాధారణంగా, మరో మూడు మండలాల్లో సాధారణం కంటే తక్కువగా వర్షపాతం నమోదైంది. జిల్లావ్యాప్తంగా చిరుజల్లులతో పాటు ఓ మోస్తరు వర్షాలే కురిశాయి గానీ భారీ వర్షాలు మాత్రం లేవు. చౌటుప్పల్, గుండాల, యాదగిరిగుట్ట మండలాల్లో సాధారణం కంటే తక్కువగా వర్షపాతం నమోదైంది. దీంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. ఇప్పటికే రైతులు నారుమడులు సిద్ధం చేసుకోగా, భారీ వర్షాలు లేకపోవడంతో నాటేయాలా? లేదా అనే సందిగ్ధంలో పడ్డారు. జిల్లా వ్యాప్తంగా చెరువుల కింద ఉన్న పొలాల్లో రైతులు బోరుబావులు ఏర్పాటుచేసుకున్నారు. చెరువుల్లో నీరు లేకపోవడంతో భూగర్భజలాలు ఇంకి బోర్లు ఒట్టిపోతున్నాయి. బీబీనగర్, పోచంపల్లి, చౌటుప్పల్, రామన్నపేట వలిగొండ మండలాల్లోని పలుప్రాంతాల్లో మూసీ నది నీటితో పంటలు సాగవుతుండగా, ఇక్కడ మాత్రమే నాట్లు పడ్డాయి.

గణనీయంగా పడిపోయిన నీటిమట్టం

జిల్లాలో సరిపడా వర్షాలు లేకపోవడంతో గణనీయంగా భూగర్భజలాలు అడుగంటాయి. సంస్థాన్‌నారాయణపురంలో 18.58 మీటర్ల లోతులో భూగర్భ జలమట్టం ఉండగా, ఆత్మకూరులో 16.90మి.మీ, బొమ్మలరామారంలో 14.29, బీబీనగర్‌లో 13.11, తుర్కపల్లిలో 13.08, రామన్నపేటలో 12.25, మోటకొండూరులో 12.06,మోత్కురులో 11.87,భువనగిరిలో 11.28, రాజపేటలో 11.45, యాదగిరిగుట్టలో 11.05, ఆలేరులో 10.74,గుండాలలో 8.86,వలిగొండలో 8.31, చౌటుప్పల్‌లో 6.44, భూదాన్‌పోచంపల్లిలో 5.30, అడ్డగూడూరులో 4.57మీటర్ల లోతుకు భూగర్భమట్టం పడిపోయింది. ఆగస్టులో వర్షాలు లేని పక్షంలో సాగు, తాగునీటికి కూడా ఇబ్బందులు తలెత్తనున్నాయి.

గత ఏడాదితో పోలిస్తే 6.16మీటర్ల దిగువకు

గత ఏడాదితో పోలిస్తే జిల్లాలో ఈసారి గణనీయంగా భూగర్భజలాలు పడిపోయాయి. గత ఏడాది 4.74మీటర్ల లోతులో నీటిమట్టం ఉండగా, 10.90 మీటర్ల లోతుకు పడిపోయింది. గత ఏడాదితో పోలిస్తే సంస్థాన్‌నారాయణపురంలో 6.70 మీటర్ల లోతుకు, ఆత్మకూరులో 9.98, బొమ్మలరామారంలో 5.30, బీబీనగర్‌లో 8.39, తుర్కపల్లిలో 7.21, రామన్నపేటలో 5.59, మోటకొండూరులో 5.77, మోత్కురులో 4.67, భువనగిరిలో 4.52, రాజపేటలో 5.27, యాదగిరిగుట్టలో 3.97, ఆలేరులో 3.96, గుండాలలో 2.80, వలిగొండలో 2.65, చౌటుప్పల్‌లో 3.48, భూదాన్‌పోచంపల్లిలో 2.68, అడ్డగూడూరులో 2.38మీటర్ల లోతుకు ఈ ఏడాది జలమట్టం పడిపోయింది.



నిండని చెరువులు

చెరువులు నిండితేనే ఆయకట్టు సాగవుతుంది. జిల్లాలో మొత్తం 1,080చెరువులు ఉండగా,10చెరువులు మాత్రమే అలుగులు పోశాయి. మిగతా చెరువుల్లోకి పెద్దగా నీరు చేరలేదు. దీంతో ఆయకట్టు సాగుపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది.చెరువుల కింద 51,325ఎకరాల ఆయకట్టు ఉంది. జిల్లాలో 100ఎకరాలకు పైగా విస్తీర్ణం ఉన్న చెరువులు 115 ఉండగా, వీటి కింద 23,805ఎకరాల ఆయకట్టు ఉంది. 100ఎకరాల కంటే తక్కువ విస్తీర్ణం ఉన్న చెరువులు 890వరకు ఉన్నాయి. వీటి కింద 27,520ఎకరాల ఆయకట్టు ఉంది. వానాకాలంలో జిల్లా వ్యాప్తంగా 4,28,850ఎకరాల్లో పంటలు సాగవుతాయని వ్యవసాయశాఖ అంచనా వేసింది. అందులో వరి 2,80,000 ఎకరాల్లో, పత్తి 1,35,000ఎకరాల్లో, ఆ తరువాత పప్పుధాన్యాలు, నూనె గింజలు, తదితర పంటలు సాగవుతాయని అంచనా వేశారు. జిలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులతో ఈ ఏడాడి సాగువిస్తీర్ణం తగ్గింది. వానాకాలంలో ఇప్పటివరకు రైతులు 2,91,139.27ఎకరాల్లో పంటలు సాగుచేశారు. అందులో వరి 1,80,969ఎకరాల్లో, పత్తి 1,00,514ఎకరాల్లో, కందులు 2693.22ఎకరాల్లో, ఇతర పంటలు 6963.05ఎకరాల్లో సాగయ్యాయి.

'సుంకిశాల' ఘటనపై దర్యాప్తు చేయాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి



సుంకిశాలను పరిశీలిస్తున్న జూలకంటి రంగారెడ్డి తదితరులు

నాగార్జునసాగర్, పెద్దవూర, ఆగస్టు 10: సుంకిశాల రక్షణ గోడ కూలడంపై సమగ్ర దర్యాప్తు చేయాలని, అందుకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం రక్షణ గోడ కూలిన సుంకిశాల పంప్ హౌస్‌ను పార్టీ నేతలతో కలిసి తనిఖీచేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, మోగా ఇంజనీరింగ్ కంపెనీ సకాలంలో నిర్మాణం పూర్తి చేయకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందన్నారు. ప్రాజెక్టు పనులను రాష్ట్ర ప్రభుత్వం పర్యవేక్షించడంలేదన్నారు. రక్షణ గోడ కూలిన సమయంలో కూలీలు షిఫ్ట్ మారేందుకు రావడంతో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదన్నారు. సుంకిశాల వరకు రోడ్డు అధ్వానంగా ఉందన్నారు. ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ కూడా చేయలేదన్నారు. నిర్మాణ సమయంలో జాగ్రత్తలు తీసుకొని ఉంటే ప్రమాదం జరిగేది కాదన్నారు. ఎగువ నుంచి వరద వస్తుండగా, సిమెంట్ పనుల్లో క్యూరింగ్ సరిగా చేయకపోవడంతో ప్రమాదం జరిగిందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఈ పనులపై నిరంతరం పర్యవేక్షణ ఉంచాలన్నారు. ఆయన వెంట సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నాయకులు బండా శ్రీశైలం, కూన్‌రెడ్డి నాగిరెడ్డి, చినపాక లక్ష్మీనారాయణ, నర్సిరెడ్డి, సత్తయ్య, షేక్ బషీర్, సత్యనారాయణ, దుబ్బ చంద్రయ్య, బాపురెడ్డి ఉన్నారు.

26 గేట్ల నుంచి కిందికి ప్రవహిస్తున్న కృష్ణమ్మ



కృష్ణమ్మ పరవళ్లు.. పర్యాటకుల కేరింతలు

సాగర్‌కు పోటెత్తిన వరద
26 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల

కృష్ణమ్మ పరవళ్లు కొనసాగుతున్నాయి. కృష్ణా బేసిన్‌లో సాగర్‌కు ఎగువన ఉన్న ప్రాజెక్టులన్నీ నిండాయి. దీంతో ఆరు రోజులుగా సాగర్ ప్రాజెక్టు క్రస్ట్‌గేట్లను కూడా ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో ఓవైపు జల ప్రవాహం ఉంటే మరోవైపు సాగర్ జనసంద్రంగా మారింది. వరుస సెలవు దినాలు కావడంతో రాష్ట్రంలో వివిధ ప్రాంతాలనుంచి పర్యాటకులు భారీగా సాగర్‌కు తరలివచ్చారు. దీంతో ఎక్కడ చూసినా సాగర్‌లో పర్యాటకుల రద్దీ కన్పించింది.

\- నాగార్జునసాగర్

పర్యాటకులతో కిక్కిరిసిన సాగర్ కొత్త బ్రిడ్జి 7

డీపీఆర్ ఆమోదించే వరకూ పోరాటం

సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం సుధాకర్‌రెడ్డి

నల్లగొండ రూరల్, ఆగస్టు 10: డిండి ఎత్తిపోతల పథకం డీఆర్‌ను ఆమోదించే వరకు సీపీఎం ఆధ్వర్యంలో దశల వారీగా పోరాటాలను నిర్వహిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి తెలిపారు. స్థానిక దొడ్డికొమరయ్య భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాలైన దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాలకు సాగునీరు అందించే డిండి ఎత్తిపోతల పథకం డీపీఆర్‌ను వెంటనే ఆమోదించి సాగునీరు అందించే వరకు సీపీఎం ఆధ్వర్యంలో పోరాటం నిర్వహిస్తామన్నారు. గత ప్రభుత్వం 2016లో జీవో నెంబర్ 107 ద్వారా డిండి ఎత్తిపోతల పథకానికి రోజుకు అర టీఎంసీ చొప్పున 60 రోజుల్లో 30 టీఎంసీల నీటిని సింగరాజుపల్లి, గొట్టిముక్కల, చింతపల్లి, లక్ష్మణాపురం శివన్నగూడెం రిజర్వాయర్లకు అందించి నింపుతామని హామీ ఇచ్చిందన్నారు. ప్రాజెక్టుకు కీలకమైన డీపీఆర్‌ను ఆమోదించకపోవడం, సుమారు 27కిలోమీటర్ల కాల్వను తవ్వే పనులకు పర్యావరణ అనుమతుల కోసం లేఖ రాయకపోవడంతో పనుల్లో తీవ్ర అలసత్వం జరిగిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం డిండి ఎత్తిపోతల పథకం డీపీఆర్‌ను ఆమోదించి అధిక నిధులు కేటాయించి ప్రాజెక్టును పూర్తిచేయాలన్నారు. ఈ నెల 11, 12న మండల కమిటీ సమావేశాలు, 12 నుంచి 19 వరకు సంతకాల సేకరణ, 20 నుంచి 26 వరకు తహసీల్దార్ కార్యాలయాల ఎదుట రిలే దీక్షలు, సెప్టెంబరు 2న కలెక్టర్‌కు సేకరించిన సంతకాల ప్రతులను అందజేస్తామన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నారి ఐలయ్య, నాయకులు బండా శ్రీశైలం, పాలడుగు నాగార్జున, చినపాక లక్ష్మీనారాయణ, మల్లం మహేష్, దండెంపల్లి సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న భూ సర్వే

గ్రామాలకే మీసేవా కేంద్రాలు



రైతుల భూముల వద్ద సర్వే నిర్వహిస్తున్న రెవెన్యూ సిబ్బంది

తిరుమలగిరి(సాగర్), ఆగస్టు 10: రెవెన్యూ పైలట్ ప్రాజెక్టులో భాగంగా నిర్వహిస్తున్న స్పెషల్ డ్రైవ్ కొనసాగుతోంది. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో రైతుల కాస్తు కబ్జాను నిర్వహించేందుకు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించారు. నెల్లికల్‌లోని సర్వే నెం.299, చింతలపాలెంలో సర్వే నెం.158, తిమ్మాయిపాలెంలో సర్వే నెం.39, జమ్మనకోటలో వివాదాస్పదంగా ఉన్న రెవెన్యూ, ఫారెస్ట్ సరిహద్దుల భూములు, తిమ్మాయిపాలెంలో సర్వే నెం.45లో జీపీఎస్ ఆధారిత సర్వే నిర్వహించారు. సర్వేను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుబ్రహ్మణ్యం పర్యవేక్షించి మాట్లాడారు. రైతుల భూములు సర్వే చేయడంతోపాటు పంచాయతీల వద్ద నోటీసు బోర్డులో వివరాలు ఉంచామన్నారు. అర్హులైన రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. గ్రామాల్లోనే మీ-సేవా కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

కొండమల్లేపల్లి, ఆగస్టు 10: గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని చింతకుంట్ల గ్రామానికి చెందిన గోరటి చంద్రయ్య అలియాస్ గంటెల చంద్రయ్య(55) కొండమల్లేపల్లి పట్టణంలో ప్లాస్టిక్ సీసాలు, తాగేసిన బీరు సీసాలు ఏరుకుంటూ తన స్వగ్రామానికి వెళ్లకుండా బజార్లోనే తిరుగుతూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం తెల్లవారుజామున 5.30 గంటల సమయంలో స్థానిక సాగర్ రోడ్డులోని సెంట్రల్ బ్యాంక్ ఎదుట గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తలకు గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చంద్రయ్యకు భార్య ఈదమ్మ, కుమారుడు సురేష్ ఉన్నారు. చంద్రయ్య కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గరిడేపల్లి: కారు, బైక్ ఢీకొని ఇద్దరికి గాయాలయ్యాయి. ఎస్ఐ. ఈట సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. చింతలపాలెం మండలం కిష్టాపురం గ్రామానికి చెందిన షేక్ మౌలాలి, చింతిర్యాలగ్రామానికి చెందిన చెడపంగు దేవబిక్షం మోటర్ సైకిల్‌పై శుక్రవారం మధ్యాహ్నం సూర్యాపేట నుంచి సొంత గ్రామాలకు వెళ్తుండగా గరిడేపల్లి మండలం అప్పన్నపేట గ్రామ శివారులో వారికి ఎదురుగా హుజూర్‌నగర్ నుంచి మిర్యాలగూడకు వెళ్తున్న కారు బైక్‌ను ఢీకొంది. దంతో మోటర్ సైకిల్‌పై ఉన్న ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మౌలాలి హైదరాబాద్‌లోని అపోలో, దేవ బిక్షం నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొదుతున్నారు. దేవబిక్షం తమ్ముడు చెడపంగు దేవయ్య ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడికి గాయాలు

● విద్యుత్ స్తంభం ఎక్కి లైట్లు వేస్తుండగా ప్రమాదం ● యాదాద్రిభువనగిరి జిల్లా మోటకొండూరు మండలంలో ఘటన

మోటకొండూరు, ఆగస్టు 10: స్తంభం ఎక్కి వీధిలైట్లు వేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సం ఘటన యాదాద్రిభువనగిరి జిల్లా మోటకొండూరు మండలంలోని ఇక్కుర్తి గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అయిలి గిరిధర్(23) గ్రామంలో ఎలక్ట్రీషన్‌గా పనిచేస్తున్నాడు. కాగా గ్రామానికి చెందిన మహేందర్ విద్యుత్ డిపార్ట్‌మెంట్‌లో ఆర్టిజన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో గ్రామంలో వీధిలైట్లు రావడం లేదని పలువురు గ్రామస్థులు పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆర్టిజన్ మహేందర్‌కు గ్రామంలో పలుచోట్ల వీధిలైట్లు రావడంలేదని వాటి స్థానంలో కొత్త లైట్లు వేయాలని చెప్పాడు. మహేందర్ ప్రైవేట్ వ్యక్తి గిరిధర్‌ను వీధిలైట్లు వేయాలని తెలపడంలో గిరిధర్ శుక్రవారం సాయంత్రం విద్యుత్ అధికారుల నుంచి అలాంటి అనుమతులు ఎల్‌సీ తీసుకోకుండా స్తంభం ఎక్కి లైట్లు వేస్తుండగా 11కేవీ తీగలకు చెయి తగలడంతో విద్యుదాఘాతంతో స్తంభంపై నుంచి కింద పడడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు ఆలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి పరిస్థితి విషమంగా ఉందని తెలుపడంలో అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయమై ఏఈ వినోద్ కుమార్ వివరణ కోరగా ఇక్కుర్తి గ్రామంలో విధిలైట్లు వేస్తున్నట్లు విద్యుత్ అధికారులకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని తెలిపారు. ఓ ప్రైవేట్ వ్యక్తితో స్తంభం ఎక్కించారని ముందస్తుగా విద్యుత్ అధికారుల నుంచి ఎల్‌సీ తీసుకుని ఉంటే ప్రమాదం జరిగి ఉండేది కాదన్నారు. విద్యు దాఘాతానికి గురైన హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అయిలి గిరిధర్‌ను ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యోల్లంల సంజీవరెడ్డి శనివారం పరామర్శించారు. గిరిధర్‌కు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

తండ్రి మందలించాడని..

గుండాల, ఆగస్టు 10: తండ్రి మందలించాడని కుమారుడు ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. ఈ సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలంలోని వెల్మజాల గ్రామంలో జరిగింది. శనివారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెల్మజాల గ్రామానికి చెందిన నల్లమాస భరత్ చౌటుప్పల్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో మేనేజర్‌గా విధులు పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 8వ తేదీన సొంత గ్రామమైన వెల్మజాలకు వచ్చాడు. కాగా కొంత కాలం నుంచి ఇంటికి డబ్బులు ఎందుకు పంపడం లేదని తండ్రి ప్రకాశ్ కుమారుడు భరత్‌ను మందలించాడు. అయితే వీరిరువురి మధ్య వాగ్వాదం జరిగింది. ఇంట్లో ఎవరికీ చెప్పకుండా భరత్ అదే రోజు ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. అతనికి ఫోన్ చేయడంతో స్విచ్ఆఫ్ వస్తుండడంతో భరత్ సోదరుడు నల్లమాస రఘు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సైదులు తెలిపారు.



యాదగిరి క్షేత్రంలో పాత ఆచారాల పునరుద్ధరణ

● నేటి నుంచి స్నాన సంకల్పం
● పుణ్య స్నానాలకోసం రూ.100టికెట్


విష్ణు పుష్కరిణి పైభాగంలో ఏర్పాటు చేసిన నైలాన్ నెట్

భువనగిరి అర్బన్, ఆగస్టు 10: తెలంగాణకే తలమానికంగా వెలుగొందుతున్న యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో వివిధ సేవలు భక్తులకు అందుబాటులోకి తెచ్చేందుకు ఆలయ అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఇప్పటికే కొన్ని పాత ఆచారాలు అందుబాటులోకి రాగా, కొత్త ఆచారాల పునరుద్ధరణకు అధికారులు ఏర్పాట్లు చేశారు. స్వామివారి జన్మదిన నక్షత్రమైన స్వాతి నక్షత్రం ఆదివారం (ఈనెల 11న) రోజున మరికొన్ని ఆచారాలు ప్రవేశపెట్టేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

కొండపైన విష్ణుపుష్కరిణిలో స్నాన సంకల్పం

స్వామివారిని దర్శించుకునే భక్తులు కొండపైన విష్ణు పుష్కరిణి (కొండపైన గుండం)లో స్నానం సంకల్పం చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. గతంలో కూడా విష్ణుపుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించే వెసులుబాటు ఉండేది. ఆ తరువాత ఇక్కడ అనుమతి ఇవ్వకుండా కొండకింద లక్ష్మీ పుష్కరిణి అందుబాటులోకి తీసుకురావడంతో భక్తులు అందులోనే పుణ్య స్నానాలు ఆచరిస్తున్నారు. భక్తుల కోరిక మేరకు పాత ఆచారాన్ని కూడా రూ.100నామమాత్రం రుసుంతో ప్రత్యేకంగా అందుబాటులోకి తెచ్చారు. అయితే ఇక్కడ స్నానం ఆచరిస్తే సంతానం కలుగుతుందని భక్తుల నమ్మకం. స్నాన సంకల్పం సమయం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు అక్కడే టికెట్ పొందే సదుపాయాన్ని కల్పించారు. కాగా, ప్రారంభం రోజు ఈనెల 11వ తేదీన భక్తులందరికీ ఉచిత అవకాశం ఉండగా, ఆ తరువాత గిరిప్రదక్షిణ భక్తులను మాత్రం ఉచితంగా అనుమతించి, గిరిప్రదక్షిణ చేయని భక్తులు టికెట్ కొనుగోలు చేయాల్సి ఉంటుంది. టికెట్ పొందని భక్తులు తలపై నీళ్లు చల్లుకునే వెసులుబాటును కల్పించనున్నారు.

భక్తులకు వేర్వేరు గదులు

పుష్కరిణి మొత్తం పైన కోతులు ప్రవేశించకుండా సుమారు రూ.2లక్షల వ్యయంతో మంకీ గార్డు మాదిరిలో నైలాన్ వైర్ నెట్ ఏర్పాటు చేశారు. పురుషులు, మహిళలకు వేర్వేరుగా అల్యూమినియం ఫ్రేమ్, బ్యాషన్ బాలెన్ షీట్‌తో రెండు గదులను భక్తులు దుస్తులు మార్చుకునేందుకు అందుబాటులోకి తెచ్చినట్లు గుట్ట సివిల్ ఈఈ దయాకర్‌రెడ్డి తెలిపారు.

అఖండ దీపారాధన

స్వామివారి స్వాతి నక్షత్రం రోజున తూర్పు రాజగోపురం ఎదురుగా ఈశాన్య (శివాలయానికి వెళ్లే మార్గంలో) దిక్కులో దీపారాధనకు ఏర్పాట్లు చేశారు. తిరుపతి తరహాలో నిత్యం వెలిగే అఖండ దీపారాధనకు ప్రత్యేకంగా ఒక షెడ్డు, దానికిందే కొబ్బరికాయలు కొట్టేందుకు ఏర్పాట్లు చేశారు. నేటి నుంచి ఈ పాత ఆచారాలు అందుబాటులోకి రానుండటంతో భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

యాదరుషి, ప్రహ్లాద మండపాలు

యాదరుషీ తపోఫలంతోనే స్వామి ఈ కొండపై వెలిశారని పురాణాలు చెబుతున్నాయి. గతంలో తులసీ కాటేజీ వద్ద ఒక మర్రిచెట్రలో విగ్రహం ఉండేది. ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా నల్లరాతితో యాదమహర్షి విగ్రహం చెక్కి అక్కడే ఏర్పాటు చేశారు. స్వామివారి ప్రియభక్తుడు భక్త ప్రహ్లాదుడికి ఇప్పటి వరకు మండపం లేదు. ఇరువురిని ఆరాధించేందుకు మండపాల ఏర్పాటుకు ఇటీవల గిరిప్రదక్షిణ రోడ్డు (కొండ పశ్చిమ దిశలో) వెంట స్థల పరిశీలన చేసి ఆన్‌లైన్ టెండర్లు పిలిచినట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు.

పాత ఆచారాల పునరుద్ధరణకు పెద్దపీట



భక్తుల కోరిక మేరకు ఒక్కొక్కటిగా పాత ఆచారాలను పునరుద్ధరిస్తున్నాం. నేటి ఆదివారం స్వామివారి స్వాతి నక్షత్రం రోజున అఖండ దీపారాధన, విష్ణుపుష్కరిణిలో స్నాన సంకల్పం ప్రారంభిస్తాం. ఇదివరకే కొండపైన డార్మెటరీ హాల్, కొబ్బరికాయలు కొట్టే స్థలం, దుకాణాలను ప్రారంభించాం. మరికొన్ని దుకాణాలను కూడా అందుబాటులోకి తెచ్చేందుకు దేవాదాయశాఖ కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపాం.

-ఈవో ఏ.భాస్కర్‌రావు, యాదగిరిగుట్ట, దేవస్థానం

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు


నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, ఆగస్టు 10: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో శనివారం నిత్య పూజలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. సుప్రభాతసేవతో మేల్కొలిపిన అర్చకస్వాములు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను వేదమంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల నడుమ పంచామృతాలతో అభిషేకించి తులసీ దళాలతో అర్చించారు. ప్రాకార మండపంలో సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో వైభవంగా చేపట్టారు. అదేవిధంగా అష్టభుజి ప్రాకార మండపంలో స్వామి అమ్మవారలను ముగ్ధమనోహరంగా అలంకరించి ప్రత్యేకవేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విశ్వక్సేనుడి తొలిపూజలతో నిత్య తిరుకల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో చేపట్టారు. సాయంత్రం ప్రధానాలయ ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన అర్చకులు, సాయంత్రం అలంకార వెండిజోడు సేవలు, సహస్రనామార్చనలు జరిపారు. పాతగుట్ట ఆలయంలో నిత్యకైంకర్యాలు వేదమంత్రాలు మంగళవాయిద్యాల నడుమ వైభవంగా నిర్వహించారు. కొండపైన శివాలయంలో పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామికి మహామండపంలో స్ఫటికమూర్తులకు నిత్యారాధనలు, యాగశాలలో నిత్య రుద్రహవన పూజలు శైవాగమ పద్ధతిలో కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.37,46,489 ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ.భాస్కర్‌రావు తెలిపారు. కాగా, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుడు ఎనుముల కృష్ణారెడ్డి కుటుంబసమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు స్వామివారికి ప్రత్యేకపూజలు జరిపారు. అనంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఆలయ అధికారుల బాధ్యతల స్వీకరణ

యాదగిరిగుట్ట దేవస్థానంలో బదిలీల ప్రక్రియ ముగిసింది. ఇక్కడి నుంచి 26మంది అధికారులు, ఉద్యోగులు బదిలీపై వేములవాడ, బాసర, భద్రాచలం, కొమురవెల్లి ఆలయాలకు వెళ్లారు. దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు తిరిగి అక్కడి నుంచి 20మంది మాత్రమే విధుల్లో చేరారు. ఇంకా ఆరుగురు ఇక్కడకు రావాల్సి ఉంది. జాయినింగ్ రిపోర్టు అందజేసినందుకు గాను దేవస్థానంలో పలు విభాగాల కేటాయింపు చేశారు. కొత్తగా విధుల్లో చేరిన అధికారులు, ఉద్యోగులకు శనివారం విధుల పట్ల కౌన్సిలింగ్ ఈవో ఏ.భాస్కర్‌రావు ఇచ్చారు. ఇప్పటి వరకు విధులు నిర్వహించిన అధికారులు, ఉద్యోగులకు కూడా పలు విభాగాల మార్పు చేశారు.



పెళ్లి బాజా మోగాల్సిన ఇంట..

● వారంలో పెళ్లి.. అంతలోనే హఠాన్మరణం
● గుండెపోటుతో యువకుడి మృతి
● నిడమనూరు మండలం ముప్పారంలో ఘటన


శివ (ఫైల్‌ఫొటో)

నిడమనూరు, ఆగస్టు 10: ఈ రోజుల్లో గుండెపోటు ఎప్పుడు ఎవరినో బలి తీసుకుంటుందో చెప్పడం కష్టంగా మారింది. చిన్న పిల్లలు సహా, ఎంతో ఆరోగ్యంగా ఉండే యువకులు సైతం గుండెపోటుకు గురై ఒక్కసారిగా ప్రాణాలు వదులుతున్నారు. నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం ముప్పారం గ్రామానికి చెందిన ఓ యువకుడు నిద్రపోతుండగా, ఒక్కసారిగా గుండెనొప్పి రావడంతో నిద్ర నుంచి శాశ్వత నిద్రలోకి వెళ్లిపోయాడు. ముప్పారం గ్రామానికి చెందిన కంచుగట్ల శంకరయ్య, పద్మ దంపతుల ఏకైక కుమారుడు కంచుగట్ల శివకుమార్ అలియాస్ బర్ల శివ(23) డిగ్రీ వరకు చదువుకున్నాడు. ఇంటి వద్దే ఉంటూ వ్యవసాయ పనులు చేసుకుంటూ తల్లిదండ్రులకు ఆసరాగా ఉంటున్నాడు. శివకు ఇటీవలే ఓ యువతితో వివాహం కుదిరింది. ఈ నెల 18వ తేదీన వివాహం జరగాల్సి ఉంది. ఒక్కడే కుమారుడు కావడంతో పెళ్లి ఘనంగా చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పెళ్లి పనుల్లో కుటుంబ సభ్యులు బిజీగా ఉన్నారు. ఈ క్రమంలో శుక్రవారం మిర్యాలగూడ వెళ్లి పెళ్లి దుస్తులు కొనుగోలు చేసి ఇంటికి వచ్చారు. పెళ్లి ఏర్పాట్ల గురించి మాట్లాడుకుంటూ, రాత్రి భోజనం చేసి అందరూ నిద్రపోయారు. శనివారం ఉదయం శివ నిద్ర నుంచి లేవకపోవడంతో తల్లి అతడి వద్దకు వెళ్లి బంధువులకు పెళ్లి పత్రికలు పంచడానికి వెళ్లాలని నిద్ర లేపే ప్రయత్నం చేసింది. కానీ, నిద్రలోనే గుండెనొప్పి రావడంతో శివ అప్పటికే మృతి చెంది ఉన్నాడు. అల్లారుముద్దుగా పెంచుకున్న ఏకైక కుమారుడు విగతజీవిగా కనిపించడంతో కన్నీరుమున్నీరయ్యారు. వారం రోజుల్లో పెళ్లి జరగాల్సి ఉండగా, ఇంతలోనే గుండెపోటుతో శివ అకాల మృతి చెందడంతో రెండు కుటుంబాల్లో విషాదం చోటుచేసుకుంది. చిన్నవయసులోనే ఒక్కగానొక్క కుమారుడు గుండెపోటుతో మృతి చెందడంతో శివ తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు, బంధుమిత్రులు బోరున విలపిస్తున్నారు. పెళ్లి బాజా మోగాల్సిన ఇంట చావు బాజా మోగడంతో తల్లిదండ్రులు రోదిస్తున్న తీరు గ్రామస్థులను కలిచివేసింది. శివ ఆకస్మిక మృతి పట్ల గ్రామస్థులు, తోటి మిత్రులు సంతాపం వ్యక్తం చేశారు. సాయంత్రం గ్రామంలో యువకుడి అంత్యక్రియలు నిర్వహించారు.

పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తాం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

● ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్

డిండి, ఆగస్టు 10: దేవరకొండ నియోజకవర్గంలోని సాగునీటి ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేసి సాగు, తాగునీరు అందిస్తామని ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. డిండి మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్ పనులను శనివారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో ఈ నెల 11న సాగునీటి ప్రాజెక్టులపై సంబంధిత అధికారులతో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. మూడేళ్లలో ఎస్ఎల్‌బీసీ, డిండి ఎత్తిపోతల పనులు పూర్తి చేసేందుకు ముఖ్యమంత్రి లక్ష్యంగా పెట్టుకున్నారని తెలిపారు. డిండి ఎత్తిపోతలకు నీటిని ఎక్కడి నుంచి తీసుకోవాలో గత ప్రభుత్వం తేల్చుకోలేక కాలయాపన చేసిందని తెలిపారు. గత ప్రభుత్వంలో బలహీనమైన నాయకత్వం ఉండటం వల్లే నల్లగొండ జిల్లా ఎడారిగా మారిందని తెలిపారు. నియోజకవర్గంలోని చందంపేట, నేరేడుగొమ్ము మండలాలలోని ఐదు లిఫ్టులు పూర్తి చేస్తామని అన్నారు. వీటితోపాటు నూతనంగా మరి కొన్ని లిఫ్టులు మంజూరు చేయించుకుంటామన్నారు. డిండి గ్రామంలో రైతుల ఆధీనంలో ఉన్న నీటిపారుదల శాఖ భూముల సమస్యను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామన్నారు. మండలకేంద్రంలోని అంగడిబజార్‌లో రూ.3 కోట్లతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తామన్నారు. ఆయన వెంట డీఎస్పీ గిరిబాబు, ప్రభాకర్, సీఐ సురేష్, ఎస్ఐ రాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వెంకటేశ్వరరావు, తాటికోలు మాజీ సర్పంచ్ జూలూరు ధనలక్ష్మి, శ్రీనివాస్‌గౌడ్, పోల లక్ష్మణ్, విద్యుత్ ఏఈ జయప్రకాష్, పయాజ్, గడ్డమీది సాయి, పున్న దినేష్, పోల వెంకటేష్, ఎంఎ.కలీం, నూకం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వాడపల్లి సంగమం వద్ద పెరిగిన నీటి ఉధృతి



వాడపల్లి సంగమం ఘాట్ల వద్ద నీటి ఉధృతి

దామరచర్ల, ఆగస్టు 10: ఎగువ నాగార్జునసాగర్ నుంచి 26 గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్న నేపథ్యంలో శనివారం మండలంలోని వాడపల్లి వద్ద గల కృష్ణా, మూసీ నదుల సంగమం ప్రదేశంలో నీటి ఉధృతి పెరిగింది. దీంతో అధికారులు మత్స్యకారులను, పర్యటకులను అప్రమత్తం చేశారు. నీటి ఉధృతి కారణంగా ఘాట్ల వద్దకు వెళ్లవద్దని వారికి సూచించారు.

పులిచింతల ప్రాజెక్టుకు కొనసాగుతున్న వరద

ఉభయ తెలుగు రాష్ట్రాల సరిహద్దులోని పులిచింతల ప్రాజెక్టుకు ఎగువనుంచి నిలకడగా వరద కొనసాగుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిసామర్థ్యం 175 అడుగులు (45.77టీఎంసీలు) కాగా, శనివారం సాయంత్రం 7గంటలకు 168.20 అడుగులు (35.86 టీఎంసీలు)గా నమోదైంది. ప్రాజెక్టు ఇన్‌ఫ్లో 3,29,189 క్యూసెక్కులు కాగా, 15గేట్ల ద్వారా 3,00,504 క్యూసెక్కులు, తెలంగాణ జలవిద్యుత్‌కేంద్రం నుంచి 16వేల క్యూసెక్కుల నీటిని వినియోగించి నాలుగు యూనిట్ల ద్వారా 80 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సాధిస్తూ నీటిని విడుదల చేస్తున్నారు. మొత్తం ఔట్‌ఫ్లో 3,16,504 క్యూసెక్కులుగా నమోదైంది.





సాగర్‌కు పోటెత్తిన వరద

నాగార్జునసాగర్, కేతేపల్లి, మేళ్లచెర్వు, ఆగస్టు 10: కృష్ణమ్మ పరవళ్లు కొనసాగుతున్నాయి. సాగర్‌కు ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు (215.8070టీఎంసీలు) కాగా, శ్రీశైలానికి ఎగువ నుంచి 3,44,618 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరడంతో శనివారం సాయంత్రానికి 882.30 అడుగులకు(200.6588టీఎంసీలకు) చేరుకుంది. దీంతో శ్రీశైలం ప్రాజెక్టు 10 క్రస్ట్‌గేట్లను 14అడుగుల మేరకు ఎత్తి 3,46,700 క్యూసెక్కుల నీటిని, కుడి గట్టు జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి చేయడం ద్వారా 29,888 క్యూసెక్కుల నీటిని, ఎడమ గట్టు జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్‌ను ఉత్పత్తి చేయడం ద్వారా 37,540 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు వదులుతున్నారు. శ్రీశైలం నుంచి సాగర్‌కు మొత్తం 4,14,128 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు (312.5050టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 588 అడుగులుగా(306.1010టీఎంసీలుగా) ఉంది. సాగర్‌నుంచి కుడి కాల్వ ద్వారా 3,597క్యూసెక్కుల నీటిని, ఎడమ కాల్వ ద్వారా 8367 క్యూసెక్కుల నీటిని, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,029 క్యూసెక్కుల నీటిని, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కుల నీటిని, 26 క్రస్ట్‌గేట్లలో 16గేట్లను 10 అడుగుల మేరకు, 10 క్రస్ట్ గేట్లను 5 అడుగుల మేరకు ఎత్తి 3,12,756 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 3,55,549 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా, ఎగువ నుంచి 4,14,128 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది.

పర్యాటకుల సందడి

వరుస సెలవు దినాలుకావడంతో సాగర్‌కు రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చారు. మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి కూడా శనివారం సాగర్ సందర్శనకు వచ్చారు. సాగర్‌కు వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు తరలిరావడంతో ఎక్కడ చూసినా పర్యాటకుల రద్దీ నెలకొంది. ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి వెళ్లే దారి గుండా సాగర్ క్రస్ట్‌గేట్లను తిలకించడానికి పర్యాటకులు బారులుతీరారు. దీంతో ఆ దారంతా పర్యాటకులతో నిండిపోయింది. అధిక సంఖ్యలో పర్యాటకులు రావడంతో ఏపీ-తెలంగాణ సరిహద్దులో ఉన్న కొత్త వంతెనపై భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. ఇదిలా ఉంటే సాగర్‌లో పర్యాటకశాఖ ఆధ్వర్యంలో నడిచే లాంచీలు జలాశయం మధ్యలో ఉన్న నాగార్జునకొండకు వెళ్లకుండా అధికారులు నిలిపివేశారు. దీంతో లాంచీ ఎక్కి నాగార్జునకొండకు వెళ్లాలని వచ్చిన పర్యాటకులు నిరాశతో వెనుదిరిగారు.

మూసీకి నిలకడగా కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

ఎగువ మూసీ పరివాహక ప్రాంతాల నుంచి ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో నిలకడగా కొనసాగుతోంది. మూసీ నది ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో వరద నీరు దిగువన ఉన్న ప్రాజెక్టుకు వచ్చి చేరుతోంది. ఎగువ నుంచి ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో శుక్రవారం సాయంత్రానికి 289.35 క్యూసెక్కులు ఉండగా, శనివారం సాయంత్రానికి కొంత మేర పెరిగి 590.62 క్యూసెక్కులుగా నమోదైంది. 645 అడుగుల (4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం ఉన్న మూసీ ప్రాజెక్టు నీటిమట్టం శనివారం సాయంత్రానికి 641.60 అడుగులు (3.59టీఎంసీ)గా ఉంది. మరోవైపు మూసీ ఆయకట్టులో వానాకాలం పంటల సాగుకు ప్రాజెక్టు కుడికాల్వకు 208.57 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 185.40 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

టెయిల్‌పాండ్‌కు కొనసాగుతున్న వరద

దామరచర్ల, ఆగస్టు 10: అడవిదేవులపల్లి మండల కేంద్రం సమీపంలోని టెయిల్‌పాండ్‌కు ఎగువ నాగార్జునసాగర్ నుంచి పెద్ద ఎత్తున వరద కొనసాగుతుండడంతో శనివారం దిగువకు నీటి విడుదల కొనసాగుతుంది. నాగార్జునసాగర్ నుంచి 3,41,785 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్న నేపథ్యంలో టెయిల్‌పాండ్‌కు భారీ ఎత్తున నీరు చేరుతుండడంతో అధికారులు టెయిల్‌పాండ్ 12గేట్లను 5.5మీటర్ల మేరా ఎత్తి దిగువకు 3,41,340 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో ఆధారంగా నీటి విడుదలను కొనసాగించనున్నట్లు టెయిల్‌పాండ్ అధికారులు తెలిపారు.

ఆహ్లాదంగా అంగన్‌వాడీలు

● రూపు రేఖలు మారుస్తున్న కస్తూరి ఫౌండేషన్




సంస్థాన్‌నారాయణపురం మండలం లచ్చమ్మగూడెంలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభిస్తున్న కస్తూరి శ్రీచరణ్

గట్టుప్పల్, ఆగస్టు 10: ప్రభుత్వ విద్యావ్యవస్థను బలోపేతం చేసినప్పుడే పేద, బడుగు బలహీన వర్గాల జీవితాల్లో వెలుగులు నిండుతాయి. ఇంటికొకరు విద్యావంతులైతే ఆ కుటుంబమే బాగుపడుతుంది. కానీ ప్రాథమిక పాఠశాల స్థాయిలోనే ఎంతోమంది విద్యకు దూరమవుతూ దుర్భర జీవితం గడుపుతున్నారు. అంగన్‌వాడీల్లో ఆహ్లాదకర వాతావరణం కల్పించే దిశగా, వాటి రూపు రేఖలు మార్చేందుకు కస్తూరి ఫౌండేషన్ చర్యలు తీసుకుంటోంది. కొంత కాలంగా ప్రాథమిక, ఉన్నత పాఠశాలల అభివృద్ధికి నిధులు కేటాయిస్తూ, వాటి పురోభివృద్ధికి కృషి చేస్తోంది. ఆ సంస్థ చైర్మన్ కస్తూరి శ్రీచరణ్ ఆధ్వర్యంలో పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి సొంత నిధులు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కస్తూరి ఫౌండేషన్ గుర్తించిన అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి కృషి చేస్తోంది. అందులో భాగంగా మునుగోడు మండలం కల్వకుంట్లలో రూ.5లక్షలతో సొంత భవనం, రంగులు, గోడలపై చిత్రాలు, పిల్లలకు ఆటబొమ్మలు, వంట సామను, పిల్లలకు చైర్లు తదితరలు సమకూర్చారు. సంస్థాన్‌నారాయణపురం, మండలం గుడిమల్కాపూర్‌లో రూ.4.50లక్షలతో నూతన భవన నిర్మాణంతోపాటు, వంట సామగ్రి, విద్యుత్ వ్యవస్థ, ఆట వస్తువులు, తదితర వస్తువులను సమకూర్చారు. లచ్చమ్మగూడెంలో 4.80లక్షలతో అంగన్‌వాడీ భవన నిర్మాణంతోపాటు చిన్నారులకు కావాల్సిన సకల సౌకర్యాలను కస్తూరి ఫౌండేషన్ కల్పించింది. కంకణాలగూడెంలో శిథిలావస్థలో ఉన్న భవనాన్ని పునరుద్ధరించడంతోపాటు కేంద్రంలో అన్ని సౌకర్యాలు కల్పించారు. గత కొన్నేళ్లుగా ప్రభుత్వ పాఠశాలల వికాసానికి కస్తూరి ఫౌండేషన్ ఎంతగానో కృషి చేసింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలల అభివృద్ధికి ఇప్పటికే రూ.5కోట్లకు ఫౌండేషన్ ఖర్చు చేసింది.

ప్రభుత్వ విద్య బలోపేతానికే అంగన్‌వాడీలపై దృష్టి



ప్రభుత్వ పాఠశాలల్లో చేరిన విద్యార్థులు, పదో తరగతికి వెళ్లేలోపు చాలామంది డ్రాపవుట్ అవుతున్నారు. దానికి కారణాలను అన్వేషించిన మా ఫౌండేషన్, మొదట ప్రాథమిక, ఉన్నత పాఠశాలలపై దృష్టి సారించింది. నల్లగొండ ఉమ్మడి జిల్లాలో ఎన్నో పాఠశాలల అభివృద్ధికి కృషి చేశాం. ఇప్పుడు పాఠశాలలకు పునాది అయిన అంగన్‌వాడీలను అభివృద్ధి చేయడం ద్వారా విద్యార్థుల సంఖ్యను మరింత పెంచే అవకాశముందని గుర్తించాం. అందులో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి కృషి చేస్తున్నాం.

కస్తూరి శ్రీ చరణ్, కస్తూరి ఫౌండేషన్ చైర్మన్

ఉపాధిహామీని నిర్వీర్యం చేసేందుకు కేంద్రం కుట్ర



సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహ

దేవరకొండ, ఆగస్టు 10: కేంద్రప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి నిధులు అరకొరగా కేటాయించి పథకాన్ని నిర్వీర్యం చేస్తుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి బొలుగూరి నర్సింహ అన్నారు. పట్టణంలోని పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో శనివారం నిర్వహించిన వ్యకాస సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రప్రభుత్వం బడ్జెట్‌లో ఉపాధిహామీకి రూ.70వేల కోట్లే కేటాయించిందని విమర్శించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి రూ.2.70 లక్షల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రోజువారీగా రూ.700 ఇవ్వాలని, 200 రోజుల పనిదినాలు పెంచాలని డిమాండ్ చేశారు. మునిసిపాలిటీలో కూడ ఉపాధిహామీ పథకాన్ని ప్రవేశపెట్టి పట్టణ ప్రజలకు ఉపాధి కల్పించాలన్నారు. నూతనంగా రేషన్‌కార్డులు, పింఛన్లు, ఇంటి స్థలాలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో సీపీఐ దేవరకొండ, చందంపేట మండలాల కార్యదర్శులు దేప సుదర్శన్‌రెడ్డి, ఉప్పునూతల వెంకటయ్య, నాయకులు మొగులయ్య, బుచ్చయ్య, వ్యకాస నాయకులు శంకర్‌నాయక్, పుల్లయ్య, లాలయ్య, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం

● ఎమ్మెల్సీ కోటిరెడ్డి


లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

హాలియా, ఆగస్టు 10: ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు వరం లాంటిందని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. హాలియాలో శనివారం లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 91మందికి మంజూరైన రూ. 23.37లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పాశం గోపాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు చెన్ను అనురాధసుందర్‌రెడ్డి, అల్లి పెద్దిరాజుయాదవ్, కౌన్సిలర్ల ఫోరం జిల్లా అధ్యక్షుడు వర్ర వెంకట్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎక్కలూరి శ్రీనివాస్‌రెడ్డి, వడ్డే సతీష్‌రెడ్డి, నడ్డి లింగయ్య, అంజాద్ ఖాన్, అబ్దుల్ హలీం, జలీల్, బండి రమేష్, మార్క్, రవినాయక్ పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

నకిరేకల్, ఆగస్టు 10: ఎన్నికల హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. నకిరేకల్ పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరు గ్యారెంటీలను అరకొరగా అమలు చేసి అసలు హామీలను అటకెక్కించారని విమర్శించారు. అధికారంలోకి వచ్చి 8 నెలలు కావస్తున్నా పాలనలో అలసత్వం కనబడుతూనే ఉందన్నారు. కేసీఆర్ నాయకత్వంలో నియోజకవర్గంలో వందల కోట్ల అభివృద్ధి పనులు, వంద పడకల ఆసుపత్రి, రోడ్లు, శ్మశానవాటికలు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. గ్రామాల్లో రైతులకు సమస్యలు లేకున్నా సమస్యలు సృష్టించి నాయకులు లక్షల రూపాయలు దండుకుంటున్నారని ఆరోపించారు. పోలీస్ స్టేషన్ల చుట్టూ రైతులు తిరగలేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నకిరేకల్ పట్టణంలో మునిసిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం పేరిట బెదిరించి సంతకాల సేకరణ చేశారన్నారు. సమావేశంలో మునిసిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సోమ యాదగిరి, కౌన్సిలర్ పల్లె విజయ్, నాయకులు సామ శ్రీనివాస్‌రెడ్డి, రాచకొండ వెంకన్న, నడికుడి వెంకటేశ్వర్లు, గుర్రం గణేష్, శంకర్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలను వెంటనే ప్రకటించాలి

నల్లగొండ కల్చరల్, ఆగస్టు 10: పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే ప్రకటించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా సహాధ్యక్షుడు మోహన్‌రెడ్డి, నల్లగొండ తాలూకా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గజవెల్లి సత్యం, యాదవాసుదేవ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని పెన్షనర్స్ భవనంలో శనివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఇంత వరకు ఏ ప్రభుత్వం కూడా ఇన్ని డీఏలను పెండింగ్‌లో పెట్టలేదన్నారు. అధికారం చేపట్టిన పెండింగ్ డీఏలను మంజూరు చేస్తామని హామీ ఇచ్చి పది నెలలవుతున్నా ఇంత వరకు ప్రకటించకపోవడం అన్యాయమన్నారు. పెన్షనర్లకు చెందిన ఈహెచ్ఎస్, పీఆర్సీ ఏరియర్స్ వంటి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అన్నారు. లేనిచో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం 25 మంది పెన్షనర్లకు జన్మదిన వేడుకలు జరిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు జెల్లా పుల్లయ్య, అంజనేయులు, సుధాకర్, జి.మోహన్, మహేశ్వర్, తాడూరి రమేష్, ప్రసాద్, మహ్మద్ హుస్సేన్, చక్రపాణి, చోల్లేటి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి

దామరచర్ల, మునుగోడు, ఆగస్టు 10: మండలకేంద్రంలోని గిరిజన బాలికల గురుకుల కళాశాల విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలను ఉన్నతాధికారులు వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి ధీరావత్ వీరన్న నాయక్ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం గురుకుల కళాశాల వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దామరచర్ల గురుకుల బాలికల కళాశాల సమస్యలకు నిలయంగా మారిందని, పలుమార్లు సమస్యలను పరిష్కరించాలని ఉన్నతాధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం శూన్యమన్నారు. కళాశాలలో 380 మంది విద్యార్థినులు విద్యనభ్యసిస్తున్నారని, వారికి కనీసం నీటివసతి కూడా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో నరసింహా, సైదా, గణేష్, దత్తు, మధు, శివ పాల్గొన్నారు.

విద్యాశాఖ మంత్రి పదవిని భర్తీ చేయాలి

మునుగోడు: ప్రభుత్వం విద్యాశాఖకు మంత్రి పదవి భర్తీ చేకుండా పూర్తి నిర్లక్ష్యం చూపుతోందని బీజేపీ అధికార ప్రతినిధి మాదగోని నరేందర్‌గౌడ్ ఆరోపించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ఎక్సైజ్ శాఖకు మంత్రి పదవి ఉండగా విద్యాశాఖకు మంత్రి ఉండకపోవటం సరైంది కాదని విమర్శించారు. విద్యాశాఖకు మంత్రిని కేటాయించకపోవడంతో విద్యావ్యవస్థ కుంటుపడుతోందన్నారు. ప్రధానంగా ప్రవేటు విద్యాసంస్థలు విద్యార్థుల నుంచి ఫీజులను ఇష్టారీతిన దండుకుంటున్నారని వాపోయారు.

మరుభూమి మాయం

● కోమటిగూడెంలో కబ్జాకు గురైన శ్మశానం
● పట్టించుకోని అధికారులు ● ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్థులు (ఫైల్ ఫొటో), శ్మశానాన్ని దున్ని ఆక్రమించిన దృశ్యం

త్రిపురారం, ఆగస్టు 10: ప్రభుత్వ భూములను ఇష్టారాజ్యంగా కబ్జా చేస్తున్న ఆక్రమణదారులు చివరకు శ్మశానాన్ని వదలలేదు. త్రిపురారం మండలంలోని కంపసాగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కోమటిగూడెంలో 275 సర్వే నెంబర్‌లో సుమారు 25 ఎకరాల విస్తీర్ణం ఉండగా ఎకరం భూమిని నాలుగు దశాబ్దాలుగా శ్మశానానికి వినియోగిస్తున్నారు. ఇదే సర్వే నెంబర్‌లో గతంలో ప్రభుత్వ సంస్థలో విశిష్ట సేవలు అందించిన వ్యక్తికి ప్రభుత్వం సుమారు 2.08 ఎకరాలను కేటాయించింది. దానిని ఆయన మండలంలోని దుగ్గేపల్లి గ్రామానికి చెందిన వ్యక్తికి విక్రయించాడు. ఆ భూమితో పాటు పక్కనే ఉన్న శ్మశానాన్ని కబ్జాకు పాల్పడినట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. దీంతో ఐదేళ్లుగా గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాక అప్పటి నుంచి సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు స్థలాన్ని పరిశీలించడం తప్ప ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. గ్రామంలో రెండేళ్ల క్రితం గ్రామంలో ఓ వ్యక్తి చనిపోవడంతో అంత్యక్రియలు కోసం శ్మశానానికి తీసుకువెళ్లగా కబ్జా చేసిన వ్యక్తి అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఆ సమయంలో పోలీసులు, రెవెన్యూ అధికారులు జోక్యంతో ఆ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. ఆ సమయంలో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం అధికారులు సమస్యను పరిష్కరించలేదు. దీంతో గ్రామస్థులు కలెక్టర్‌తో పాటు స్థానిక అధికారులకు ఫిర్యాదులు చేశారు. అయినా అధికారులు పట్టించుకోలేదు. గత నెల 2వ తేదీన శ్మశానం కబ్జాపై 'ఆంధ్రజ్యోతి' లో కథనం ప్రచురించడంతో తహసీల్దార్‌తో పాటు ఎస్ఐ శ్మశానాన్ని పరిశీలించారు. సర్వే చేసి కబ్జాను తొలగించి హద్దులు ఏర్పాటు చేస్తామని గ్రామస్థులకు హామీ ఇచ్చారు. నెల రోజులు దాటినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. వారం రోజులుగా శ్మశాన స్థలాన్ని ఆక్రమణదారుడు ట్రాక్టర్‌తో దున్ని వరి నాటు వేయడానికి సిద్ధమయ్యాడు. విషయాన్ని గ్రామస్థులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయినా అధికారుల్లో ఇంతవరకు స్పందన లేకపోవడం గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శ్మశాన కబ్జాపై విచారణ చేసి ఆక్రమణలను తొలగించి హద్దులు ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా ...

శ్మశానం కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినా ఫలితం లేకుండా పోయింది. ప్రస్తుతం శ్మశానాన్ని దున్ని వరి నాట్లు వేస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. కబ్జాపై ప్రశ్నిస్తే ఆక్రమదారులు దాడులకు పాల్పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం

● ఎమ్మెల్యే వేముల వీరేశం



చిట్యాలరూరల్, నకిరేకల్, కేతేపల్లి, ఆగస్టు 10: గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులను కల్పించేందుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తుందని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండలంలోని వెలిమినేడులో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. గ్రామాల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రతీ గ్రామంలో సమస్యలను పరిష్కరించి అభివృద్ధి పనులను చేపట్టేందుకు తగిన విధంగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ-1 దేశబోయిన స్వరూపనర్సింహ, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం

నకిరేకల్, కేతేపల్లి: సీఎం సహాయనిధి పేదలకు వరంలాంటిదని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నియోజకవర్గం పరిధిలోని రామన్నపేట, కేతేపల్లి మండలాల గ్రామాలకు చెందిన 120లబ్ధిదారులకు సీఎం సహాయనిధి కింద మంజూరైన రూ. 59.09లక్షల చెక్కులను నకిరేకల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీరేశం మాట్లాడుతూ ప్రజాపాలన వచ్చిన తర్వాత ఈ నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం నేటితో ముగుస్తుందని, ప్రతి ఒక్కరూ ఐదు నుంచి పది మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో రామన్నపేట, కేతేపల్లి, నకిరేకల్ మండలాల పార్టీ అధ్యక్షులు సిరిగిరెడ్డి మల్లారెడ్డి, కంపసాటి శ్రీనివాస్, నకిరేకంటి యేసుపాదం, నాయకులు, జి.మాధవరెడ్డి, మట్టి సాల్మన్, బడుగుల నరేందర్, లతీఫ్, కత్తుల వీరయ్య, జి.ప్రభాకర్, కె.వెంకటరమణ, డి.సాయిరెడ్డి, జి.వెంకన్నగౌడ్, కె.మల్లేష్, టి.జితేందర్, వెంకట్రాములు పాల్గొన్నారు.

మంత్రి ఉత్తమ్ పర్యటనను విజయవంతం చేయాలి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

మిర్యాలగూడ అర్బన్, ఆగస్టు 10: రాష్ట్ర ఇరిగేషన్, పౌరసరఫరాలశాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పర్యటనను కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, రైతులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి కోరారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని అడవిదేవులపల్లి మండలంలో నిర్మిస్తున్న దున్నపోతులగండి ఎత్తిపోతల పథకం పురోగతిని మంత్రి పరిశీలించినున్నట్లు తెలిపారు. అనంతరం ఇరిగేషన్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి పథకం నిర్మాణ పనులపై దిశానిర్దేశం చేస్తారన్నారు. దున్నపోతులగండి ఎత్తిపోతల పథకం వద్దకు నేడు ఉదయం 11:30 గంటలకు మంత్రి చేరుకుంటారని తెలిపారు. ఆయన వెంట నాయకులు ధీరావత్ స్కైలాబ్‌నాయక్, గాయం ఉపేందర్‌రెడ్డి, నూకల వేణుగోపాల్‌రెడ్డి, పొదిల శ్రీనివాస్, కొమ్ము శ్రీను, అర్జున్ తదితరులు ఉన్నారు.

పోరాట యోధులను స్మరించుకోవాలి


నల్లగొండలో చంద్రబోస్ విగ్రహాన్ని శుభ్రం చేస్తున్న వర్షిత్‌రెడ్డి

రామగిరి, చింతపల్లి, దేవరకొండ, కట్టంగూరు, ఆగస్టు 10: స్వాతంత్ర్య సమరయోధుల పోరాట ఫలితంగానే నేడు మనందరం ప్రశాంతంగా ఉండగలుగుతున్నామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి అన్నారు. 11 నుంచి 15వ తేదీ వరకు హర్‌ఘర్ తిరంగ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లాలోని మండలాల్లో మహనీయుల విగ్రహాలు, స్మారక చిహ్నాల చుట్టూ పరిశుభ్రం చేసినట్లు తెలిపారు. అమరవీరుల స్మారక చిహ్నాలు, విగ్రహాల వద్ద పుష్పాంజలి ఘటించాలి. అదేవిధంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగిరే లాగా బీజేపీ కార్యకర్తలు తిరంగా యాత్ర ర్యాలీలు చేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ప్రధాని నరేంద్రమోదీ దేశ సమగ్ర అభివృద్ధికి కృషి చేసినట్లు తెలిపారు. హర్‌ఘర్ తిరంగా ప్రచారం జాతీయ ఉద్యమంగా మారిందని, దేశంలో ప్రతీ ఒక్కరికి దేశభక్తి పెరిగిందన్నారు.

● నల్లగొండ పట్టణంలోని బస్టాండ్ సమీపంలోని సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్ని శనివారం శుభ్రం చేసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మాదగాని శ్రీనివాస్‌గౌడ్, పార్టీ రాష్ట్ర నాయకులు గోలి మధుసూదన్‌రెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్, పిల్లి రామరాజు యాదవ్, పోతేపాక సాంబయ్య, ఫకీర్ మోహన్‌రెడ్డి, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు పెరిక మునికుమార్, అసెంబ్లీ కన్వీనర్ దాయం భూపాల్‌రెడ్డి, నాయకులు కంకణాలు నాగిరెడ్డి, తార, శాంతి స్వరూప్, నాగేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.


చింతపల్లిలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న బీజేపీ శ్రేణులు

● చింతపల్లిలో పార్టీ జిల్లా కార్యదర్శి చేనమోని రాములు ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కార్యకర్తలందరూ కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు సముద్రాల నగేష్, కుక్కడపు రామకృష్ణ, సైదులు, బొడ్డు మహేష్‌గౌడ్, కుందేళ్ల చిన్నకేశవ, శ్రీశైలం, గజ్జ అభినవ్, మోర వెంకటరమణ, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

● దేవరకొండలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకూరి నర్సింహ మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ దేశ సమగ్ర అభివృద్ధికి కృషి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు గుండాల అంజయ్యయాదవ్, నాయకులు పబ్బు సైదులు, జల్దా భాస్కర్, ఆంజనేయులు, ఎర్ర బిక్షపతి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

● కట్టంగూరులో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి గున్నాల నాగరాజు మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు ప్రతీ గ్రామంలో ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని అన్నారు. అమరవీరుల స్మారక చిహ్నాలు, విగ్రహాల వద్ద పుష్పాంజలి ఘటించారు.

దేవాలయాలు ఆధ్యాత్మికతకు నిలయాలు

● సీఎల్పీ మాజీ నేత జానారెడ్డి


శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న జానారెడ్డి

హాలియా, ఆగస్టు 10: దేవాలయాలు ఆధ్యాత్మికతకు నిలయాలని సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి అన్నారు. హాలియాలో శనివారం నిర్వహించిన శ్రీ స్వయంభూ భక్తాంజనేయస్వామి దేవాలయ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ భక్తి మార్గాన్ని అలవర్చుకోవాలన్నారు. ఆలయాల అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలను ఎల్లప్పుడూ అందిస్తానని ఆలయ నిర్మాణానికి రూ.10లక్షల విరాళాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు జానారెడ్డిని శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు కర్నాటి లింగారెడ్డి, కాకునూరి నారాయణగౌడ్, రామాలయ అధ్యక్షుడు మేడేపల్లి మోహన్‌రావు, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చిట్టిపోలు యాదగిరి, నాయకులు తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, చంద్రారెడ్డి, నరేందర్‌రెడ్డి, ఆంజనేయులు, వెంకట్‌నారాయణరెడ్డి పాల్గొన్నారు.

అర్హులైన వారికి రేషన్ కార్డులు ఇవ్వాలి

శాలిగౌరారం, ఆగస్టు 10: ఎన్నికల హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి చలకాని మల్లయ్యయాదవ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులైన వారికి రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్ ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు గడిచినా హామీలను అమలుచేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. సమావేశంలో నాయకులు తెలుకుంట్ల జగన్, మక్క బుచ్చిరాములు, డెంకల లింగయ్య, బట్ట బిక్షం, జూలూరి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నాగార్జునసాగర్, ఆగస్టు 10: తూనికలు, కొలతల మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ ఎం ఎస్ జైస్వాల్ అన్నారు. వినియోగదారుల సంఘాల రాష్ట్ర సమాఖ్య ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ హిల్‌కాలనీలోని విజయవిహార్ అతిథిగృహంలో శనివారం నిర్వహించిన చైతన్య సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రెరా చైర్మన్ సత్యనారాయణ, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ రాష్ట్ర డైరెక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ తూనికలు, కొలతపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ముగింపు కార్యక్రమానికి కలెక్టర్ నారాయణరెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నారాయణరెడ్డి మనోహర్, రవి, తదితరలు పాల్గొన్నారు.

జాతీయ జెండా నిర్మాణ పనులకు సహకరించాలి

మిర్యాలగూడ అర్బన్, ఆగస్టు 10: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని ఎన్నెస్పీ క్యాంపులో గ్రౌండ్‌లో నిర్మిస్తున్న 100 అడుగుల జాతీయజెండా పనులు పూర్తయ్యేంత వరకు ప్రజలు సహకరించాలని ఆర్డీవో శ్రీనివాసరావు కోరారు. పట్టణంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు క్యాంపు గ్రౌండ్‌లో ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించవద్దని సూచించారు. నిర్మాణ పనులకు ఎలాంటి ఆటంకాలు ఎదురు కాకుండా ఉండేందుకు గ్రౌండ్ చుట్టూ ఉన్న రోడ్డుమార్గాలపై ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు ఆర్డీవో తెలిపారు. మునిసిపల్ - టూటౌన్ పోలీస్‌స్టేషన్ రోడ్డు, టాకా రోడ్డు - మునిసిపల్ ఆఫీస్‌రోడ్డు, ఎన్నెస్పీ క్యాంపుగ్రౌండ్ - ఎక్సైజ్‌పోలీస్‌స్టేషన్ రోడ్డు, రైతుబజార్ - ఎన్నెస్పీ క్యాంపు గ్రౌండ్ రోడ్లపై ట్రాఫిక్ ఆంక్షలు ఆగస్టు 15 ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అమలులో ఉంటాయన్నారు. ప్రజలంతా అధికారులకు సహకరించి జాతీయ జెండా పండుగను విజయవంతం చేయాలని ఆర్డీవో కోరారు.

మొక్కలను నాటి పచ్చదనం పెంచాలి


మొక్క నాటుతున్న ఆలయసిబ్బంది

కనగల్, ఆగస్టు 10: మొక్కలను నాటి పచ్చదనం పెంచాలని దర్వేశిపురం శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయ సీనియర్ అసిస్టెంట్ జినుకుంట్ల చంద్రయ్య అన్నారు. ఎండోమెంట్ కమిషనర్ ఆదేశాల మేరకు పచ్చదనం పరిశుభ్రతలో భాగంగా శనివారం ఆయన ఆలయ పరిసరాల్లో వివిధ రకాల మొక్కలను సిబ్బందితో కలిసి నాటారు. ఈ సందర్భంగా చంద్రయ్య మాట్లాడుతూ వర్షాలు కురిసి కరువు దరిచేరకుండా ఉండాలంటే మొక్కలను విరివిగా నాటి సంరక్షించాలని అన్నారు. కార్యక్రమంలో జేఏ కూసం ఉపేందర్‌రెడ్డి, అర్చకులు ఫణి సిబ్బంది వెంకటయ్య, అంతమ్మ, రమణమ్మ, అండాలు, శ్రీకర్, నాగరాజు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం...

చింతపల్లి: విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షుడు రమావత్ లక్ష్మణ్‌నాయక్ డిమాండ్ చేశారు. చింతపల్లి హాస్టల్‌ను సందర్శించి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ బీసీ సంక్షేమ హాస్టల్లో ఉండే పేద విద్యార్థులకు నేటి వరకు దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేయలేదని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు బుడిక వెంకటేష్, నేర్లపల్లి చరణ్, రాములు, పొట్ల రాకేష్, గోలి శివ, శివయ్య, రాజు పాల్గొన్నారు.

కనగల్: మండలంలోని రేగట్టే గ్రామానికి చెందిన వేముల చంద్రమౌళి జ్ఞాపకార్థం ఆయన సతీమణి వేముల మంగ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలోని సుమారు 100 మంది విద్యార్థులకు నోటుబుక్స్, పెన్నులు, పెన్సిళ్లను అందజేశారు. పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం మహమ్మద్ జాన్‌ఖాన్, ఏపీపీ చైర్మన్ రమాదేవి, సీఆర్పీ సంతోష్, చంద్రమౌళి కుమారులు, కుమార్తెలు ప్రకాష్‌గౌడ్, గీతాంజలి, గిరిజ ఉపాధ్యాయులు తదితరులున్నారు.

కేతేపల్లి: మండలంలోని చీకటిగూడెం గ్రామంలో ఇటీవల మృతి చెందిన ముత్తినేని ధనమ్మ కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు దైద రవీందర్ పరామర్శించారు. ఆయన వెంట నాయకులు కోట పుల్లయ్య, పూర్ణచందర్‌రావు, గణేష్, వెంకన్న, నవీన్, సీతయ్య ఉన్నారు.

కట్టంగూరు: కట్టంగూరు మండల కేంద్రానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు మేడి ఎల్లయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. భవన నిర్మాణ కార్మికుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా నాయకుడు పెంజర్ల సైదులు కోరారు.

మిర్యాలగూడ రూరల్: ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండలంలోని సుబ్బారెడ్డిగూడెం గ్రామానికి చెందిన మంద శివ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేసి ప్రభుత్వం పరిష్కరించేలా కృషి చేస్తానన్నారు.

చండూరు: బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా చండూరు పట్టణానికి చెందిన అన్నెపర్తి యాదగిరి నియమితులయ్యారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి, దళిత, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేస్తానని అన్నారు.

చండూరు: చండూరు ఎస్ఐగా ఎన్.వెంకన్నను బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మండల అధ్యక్షులు పెదగోని వెంకన్న, కోడి గిరిబాబు కార్యకర్తలతో కలిసి పోలీస్‌స్టేషన్‌లో వేర్వేరుగా కలిసి శాలువాలతో ఘనంగా సన్మానించి సత్కరించారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు ముందుండాలని, అందుకు తాము సహరిస్తామని తెలిపారు.

చింతపల్లి: ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతోనే రాష్ట్రం అన్ని రంగాల్లో ప్రగతి సాధిస్తుందని మాజీ ఎంపీపీ కొండూరి భవానిపవన్ కుమార్ అన్నారు. దేవరకొండ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బాలునాయక్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గొడుకొండ్ల గ్రామాభివృద్ధికి నిధులు కేటాయించి తోడ్పాటునందించాలని వారు తెలిపారు. కలిసిన వారిలో ప్రముఖ వ్యాపారవేత్త ఇడుకుళ్ల రాంమోహన్, ఎం.డి. రహీం, నందపట్ల లక్ష్మణ్‌సాగర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అడవిదేవులపల్లి: మండలకేంద్రం శివారులో ఉన్న దున్నపోతులగండి పనుల పురోగతిని పరిశీలించేందుకు రానున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొదిల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మంత్రి పర్యటనకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు బాలునాయక్, బండి నాగేశ్వర్‌రావు, బండి నర్సింహారావు, చిట్యాల ఏడుకొండలు పాల్గొన్నారు.

కనగల్: రానున్న స్థానిక ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మాదగోని శ్రీనివాస్‌గౌడ్ కోరారు. మండలంలోని దొరెపల్లి గ్రామంలో వివిధ పార్టీలకు చెందిన పలువురు కార్యకర్తలు మాదగోని సమక్షంలో చేరారు. వారికి ఆయన కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ప్రతి కార్యకర్త పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ప్రధాని మోదీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పులకరం బిక్షం, నాయకులు దాసరి వెంకన్న, బైరగోని శేఖర్, సురేష్, బాలకృష్ణ, ఏడుకొండలు, మల్లేష్, అశోక్ పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లి మండలంలోని చిన్న నారాయణపురంలో గల తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ కట్టంగూరుకు సంబంధించిన నూతన పేరెంట్స్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

విద్య, వ్యవసాయ రంగాల్లో సాంకేతికత

నల్లగొండ రూరల్, ఆగస్టు 10: విద్య, వ్యవసాయ రంగాల్లో శాస్త్ర సాంకేతికతను జోడించి ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ కోణం ఫౌండేషన్ నిస్వార్థ సేవకు చిరునామాగా నిలిచిందని జడ్పీ సీఈవో ఎస్ ప్రేమ్‌కరణ్ రెడ్డి కొనియాడారు. నల్లగొండ పట్టణంలో నిర్వహించిన కోణం ఫౌండేషన్ వార్షికోత్సవానికి ఆయన హాజరై మాట్లాడారు. విదేశాల్లోనే కాకుండా మాతృదేశంలో కూడా సొంతంగా కంపెనీని నెలకొల్పి అర్హులైన నిరుద్యోగులకు ఉపాధి కల్పించడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్న సంస్థ వ్యవస్థాపకులు సాందీప్ కోణం ఆలోచనలు అందరికి స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ సి.రఘురామిరెడ్డి, డీఈవో భిక్షపతి, కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ సీఈవో ఎంవీ గోనారెడ్డి, ఏడీఏ హుసన్‌బాబు, జనగనమణ ఉత్సవ కమిటీ ప్రధానకార్యదర్శి కొలను పాక రవికుమార్, సంస్థ ప్రతినిధులు బి.మహేష్, శ్వేత పాల్గొన్నారు.



కోణం సావనీర్‌ను విడుదల జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి